సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శుక్రవారం 15 డిసెంబర్ 2023



నిరీక్షణ.. ఇంకెన్ని రోజులు?

కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ (బీఓఎస్)నియామకంలో అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. - 8లో



బాలుడి హత్యకేసులో యావజ్జీవం - 8లో

స్నేహితుడి భార్యను లొంగదీసుకోవడానికి, వారి కుమారుడిని గొంతు నులిమి చంపిన నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్షపడింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29⁰ /17⁰

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో మానసిక ఉల్లాసం

హన్మకొండ అర్బన్: క్రీడలతో దివ్యాంగుల్లో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని శ్రీవేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనర్సమ్మ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని జేఎన్‌ఎస్, ఓసిటీలోని మైదానంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో తమ పాఠశాల (టీటీడీ) విద్యార్థులు పాల్గొని ప్రతిభ కరిచినట్లు ఆమె తెలిపారు. విజేతలుగా నిలిచిన పి.సాత్విక, వినోద్ (రన్నింగ్), సాత్విక, జె.అరవింద్(షాట్ పుట్), పి.శ్రీశాంత్ (చెస్), జె.అరవింద్, ఎం.రేవంత్(క్యారమ్స్), కె.శ్వేత, పి.సాత్విక (క్యారమ్స్)ను ప్రిన్సిపాల్, సిబ్బంది, తదితరులు అభినందించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు: ఏసీపీ



ఎంజీఎం: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ అన్నారు. గురువారం కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్య విద్య మొదటి సంవత్సరం విద్యార్థులకు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన ఏసీపీ కిషన్ మాట్లాడుతూ.. వైద్య విద్య ఎంతో గొప్పదని, క్రమశిక్షణతో మెడికల్ విద్యను అభ్యసించాలన్నారు. సీనియర్లు ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తే ప్రిన్సిపాల్‌కు, తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: పారామెడికల్, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (2021, 2022, 2023 బ్యాచ్)లో పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి అప్రెంటిస్ షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈఓ గోపాల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. హనుమకొండ జిల్లాకు చెందిన ఆయా విద్యార్థులు నుంచి మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. హనుమకొండలోని మిషన్ ఆస్పత్రి, పరకాల పీహెచ్‌సీకి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు, ఎంజీఎం, సీకేఎం ఆస్పత్రుల కోసం దరఖాస్తులు చేసుకోవాలనుకునే వారు వరంగల్ జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మిగతా ఆసక్తిగల విద్యార్థులు హనుమకొండలోని డీఐఈఓ కార్యాలయం (ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల)లో ఈనెల 30 వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆయా విద్యార్థులు తమ బయడేటాలతోపాటు ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు, టీసీ, ఆధార్ జిరాక్స్ కాపీలను సమర్పించాలని కోరారు.

నేడు బాలగోపాల్ స్మారకోపన్యాసం

కేయూ క్యాంపస్: మానవ హక్కుల నేత, గణిత శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కె.బాలగోపాల్ 13వ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని ఈనెల 15న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్మారకోపన్యాసం క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 'మానవ హక్కులు–ప్రజాస్వామ్యం' అంశంపై అనంతపురం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హిస్టరీ విభాగం రిటైర్డ్ అధ్యాపకుడు, మానవ హక్కుల యాక్టివిస్ట్ ఎ.చంద్రశేఖర్ స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొనాలని కోరారు.

టీజీకేబీయూ జిల్లా నూతన కార్యవర్గం



శివ



నగేశ్

హసన్‌పర్తి: తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్ అండ్ బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం హనుమకొండ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాత్ల సదానందం తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా తగరం శివ, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి నగేశ్, గౌరవాధ్యక్షుడిగా గుడెల్లి లక్ష్మణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఆనందరావు, కోశాధికారి పోరెడ్డి మల్లారెడ్డి, కార్యదర్శిగా చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగా చల్లా మహేందర్‌రెడ్డి, నీలం కుమార్, పర్శ భాస్కర్, మ్యాక వెంకటేశ్, మేరుగు నిరంజన్ ఎన్నికైనట్లు సదానందం తెలిపారు.

గస్తీకి సుస్తీ!

కాలనీల్లో రాత్రివేళ పోకిరీల వికృత చేష్టలు
- 'ప్రతినిధుల' సేవలకే పోలీస్ అధికారులు పరిమితం!
- నిత్యం రైల్వేస్టేషన్, బస్టాండ్ల వద్ద దాడులు
- ఇటీవల ఆకతాయిల దాడిలో ఓ యువకుడి మృతి
- లక్ష్యాలు నెరవేర్చలేకపోతున్న ఇంటర్‌సెప్టర్, బ్లూకోల్ట్స్ టీంలు

వరంగల్: నగరంలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు నిర్వహించే గస్తీకి సుస్తీ చేసింది. దీంతో పోకిరీల ఆగడాలు మితిమీరుతున్నాయి. రోజూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5గంటల వరకు సెక్టార్ల వారీగా గస్తీ బృందాలు పెట్రోలింగ్ నిర్వహించాలి. కానీ ఎప్పుడో ఒకసారి పెట్రోలింగ్ చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. కొద్దికాలంగా వరంగల్ ప్రాంతంలోని కాశిబుగ్గ, గిర్మాజీపేట, చార్‌బౌళి, లక్ష్మీపురం, క్రిస్టియన్ కాలనీ, లేబర్ కాలనీ, చింతల్, ఖిలా వరంగల్ మధ్యకోట, ఓసిటీ, ఏనుమాముల, మండిబజార్, ఎల్‌బీనగర్, దేశాయిపేట, ఎస్సారెస్పీ కెనాల్, డాక్టర్స్ కాలనీ, కూరగాయల మార్కెట్, రైల్వేస్టేషన్, అండర్ బ్రిడ్జి, కరీమాబాద్, ఉర్సు గుట్ట తదితర ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటితే జనం బయటికొచ్చేందుకు జంకుతున్నారు. ఆ సమయంలో పోకిరీలు బహిరంగంగా మద్యం సేవిస్తూ.. వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. కొంత మంది పోకిరీలు బైక్‌లపై విన్యాసాలు చేస్తున్నారు. ద్విచక్రవాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇదేంటని అడిగిన వారిపై దాడులకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వరంగల్ రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి కూరగాయల మార్కెట్‌కు వస్తున్న వారిపై దాడులు చేసి నగదు, ఫోన్లు లాక్కోవడం పరిపాటిగా మారింది. పలు జంక్షన్లలో అర్ధరాత్రి దాటిందంటే ఆయా ప్రాంతాల యువకులు గుమిగూడి వచ్చిపోయే వారిని బెదిరించడం పరిపాటిగా మారింది. కాలనీల్లో, చౌరస్తాల్లో ఇంత జరుగుతున్నా.. పోలీసులు గస్తీని పకడ్బందీగా నిర్వహించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సేవలకే సలాం..

ఇప్పటి వరకు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలోని అధికారులు స్టేషన్లకే పరిమితం కావడం, అధికార పార్టీ నాయకులకు సంబంధించిన సేవల్లోనే మునిగితేలడంతో క్షేత్రస్థాయిలో జరిగే ఇలాంటి ఘటనలు బయటకు రావట్లేదు. ఒక్కో స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇద్దరు నుంచి నలుగురు ఎస్‌ఐలు ఉన్నప్పటికీ శాంతి భద్రతలపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం నూతన వాహనాలు సమకూర్చినప్పటికీ కేవలం స్థానిక రాజకీయ నాయకులకు పర్యటనలకు, అధికారులు పరిమితం కావడం, ఇంటి నుంచి రాకపోకలకు, సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ స్టేషన్‌కు ఒకటి చొప్పున ఇంటర్ సెప్టార్ వాహనాలు, రెండు, మూడు చొప్పున బ్లూకోల్ట్స్ టీంలు ఉన్నప్పటికీ పెద్దగా ప్రయోజనం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. ఈ అధికార సేవకు ఫుల్‌స్టాప్‌లు పడుతుందా? అదే ఆనవాయితీ కొనసాగుతుందా? వేచి చూడాలి.



పోకిరీల దాడిలో రెండు కాళ్లు, చేయి విరిగిన సిరివెల్ల వినోద్(ఫైల్)



రాకేశ్‌పై దాడి చేసేందుకు వెంటపడుతున్న ఇద్దరు ఆకతాయిలు (సీసీ ఫుటేజీ, ఫైల్)

ఇటీవలి కొన్ని ఘటనలు..

- ఈనెల 4న అర్ధరాత్రి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం సమీపంలో నడుస్తూ వెళ్తున్న యువకుడు రాకేశ్‌పై గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు ఆకతాయిలు దాడి చేశారు. అతడి నుంచి బంగారు ఆభరణాలు, రూ.6500లు లాక్కెళ్లారు. రాకేశ్‌ను విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్ర గాయాలతో అస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ ఈనెల 12న చనిపోయాడు.
- ఏప్రిల్‌లో కాశిబుగ్గ–ఏనుమాముల ప్రధాన రహదారిపై ముగ్గురు పోకిరీలు బైక్‌పై స్పీడ్‌గా పక్క నుంచి వెళ్లడంతో భయాందోళనలకు గురైన వివేకానంద కాలనీకి చెందిన సిరివెళ్ల వినోద్ మెల్లగా పోవాలని చెప్పాడు. దీంతో అతడిపై పోకిరీలు దాడి చేశారు. మృతి చెందాడని వదిలివెళ్లిపోయారు. గాయపడిన వినోద్‌కు రెండు కాళ్లు, కుడి చేయి పూర్తిగా పనిచేయకుండా పోయాయి. పోలీసులు కేసు నమోదు చేశారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదనే అపవాదు ఉంది.
- మార్చిలో చికెన్‌షాప్‌లో ఉద్దెర ఇవ్వనందుకు ఆ దుకాణా యజమాని ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి వెళ్లి బైక్‌పై కత్తి గుచ్చి బెదిరించాడు. యాసిడ్ పోసి తగలబెడతా... అంతు చూస్తా.. అంటూ ఆడియో రికార్డు పంపించాడు. అయినప్పటికీ పోలీసులు బెదిరించింది ఎవరు అనే దానిపై కనీస దృష్టి సారించలేదని సమాచారం.
- ఈనెల 11న రాత్రి కాశిబుగ్గ వివేకానంద కాలనీ ఒక ఇంట్లోకి చొరబడి బీరువా పగులగొట్టి రూ.3 లక్షలు దోచుకెళ్లారు. అదే కాలనీలో నెల క్రితం ఒక ఇంట్లో రూ.54 వేలు నగదు, మరో రెండు ఇళ్లలో నగదు, బంగారు నగలు, సెల్‌ఫోన్ దోచుకెళ్లారు. అలాగే శివాలయం సమీపంలో ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను అపహరించుకుపోయారు.
- ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా.. బయటకు మాత్రం కొన్ని మాత్రమే వస్తున్నాయి. ఫిర్యాదు చేసినా పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో పునరావృతం అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు పూర్తి స్థాయిలో పెట్రోలింగ్ చేయకపోవడం కూడా ఇందుకు ఒక కారణమని భావిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి గస్తీని పకడ్బందీగా నిర్వహిస్తే ఇలాంటి ఘటనలు జరగవని, ఆకతాయిల వికృత చేష్టలను పూర్తి స్థాయిలో అణచి వేయాలని నగర వాసులు కోరుతున్నారు.

మహాజాతరకు రూ.75 కోట్లు



నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- మేడారం జాతరకు మిగిలింది ఇంకా 68 రోజులే..
- పనులు త్వరితగతిన చేపడితేనే పూర్తయ్యే చాన్స్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మేడారం సమ్మక్క– సారలమ్మ జాతర ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈమేరకు జాతరలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గురువారం ప్రభుత్వం రూ. 75కోట్ల నిధులను మంజూరు చేసింది. మేడారంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వానికి ఆయా శాఖల వారీగా కలెక్టర్, ఐటీడీఏ నుంచి రూ.75 కోట్ల నిధుల మంజూరు కోరుతూ.. 6 నెలల ముందుగానే ప్రతిపాదనలు పంపించారు. అప్పటి ప్రభుత్వం నిధుల మంజూరులో జాప్యం చేయడం, ఎన్నికలు రావడంతో జాతరకు ముందస్తుగా నిధులు మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిధులు మంజూరయ్యాయి. దీంతో జాతరలో అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టనున్నారు.

కొత్త ప్రభుత్వ హయాంలో..

వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జాతర జరగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా కొలువుదీరిన సమయంలో ఈ జాతర జరగనుంది. ఇదే క్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, శిశు, మహిళా సంక్షేమశాఖ మంత్రిగా సీతక్క, దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రిగా కొండా సురేఖకు పదవులు దక్కాయి. ఇద్దరు మంత్రులకు మేడారం జాతర నిర్వహణపై పూర్తి అవగాహన ఉంది. ఇటీవల సీతక్క గిరిజన సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంత్రులు సీతక్క, కొండా సురేఖను బుధవారం మేడారం సమ్మక్క– సారలమ్మ జాతర ఈఓ రాజేంద్రం, పూజారులు కూడా కలిశారు. వారు కలిసిన మరుసటి రోజే జాతరకు నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో పూజారులు హర్షం వ్యక్తం చేశారు.

మిగిలింది 68 రోజులే..

మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరకు ఇంకా 68 రోజుల సమయం మిగిలింది. తక్కువ రోజుల్లో రూ.75 కోట్ల నిధులతో చేపట్టిన పనులు పూర్తవడం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నాలుగు, ఐదు నెలల ముందుగా జాతర పనులు చేపట్టినా రేపు జాతర అనే నాటికి కూడా పనులు సాగుతూనే ఉండేవి. ఇంత తక్కువ సమయంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులకు సంబంధించి శాఖల వారీగా టెండర్లను నిర్వహించాల్సి ఉంది. టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు పనుల అనుమతికి టెక్నికల్ ఆర్డర్లు జారీ చేస్తేనే పనులు మొదలు పెడతారు. ఎంత వేగవంతంగా ఈ టెండర్ల ప్రక్రియ ముగించాలన్నా కనీసం 20 రోజుల సమయం పడుతుంది. మిలిగిన రోజుల్లో జాతర ఏర్పాట్లు ఏ మేరకు పూర్తవుతాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి వేగంగా పనులు చేపడితేనే ముందుకు సాగే ఆస్కారం ఉందని భక్తులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

శాఖల వారీగా నిధులు ఇలా.. (రూ.లలో)

ఆర్అండ్‌బీ	2.80 కోట్లు
పంచాయతీరాజ్	4.35 కోట్లు
నీటి పారుదల	6.11 కోట్లు
గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్	8.28కోట్లు
గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం	14.74కోట్లు
జిల్లా పంచాయతీ విభాగం	7.84 కోట్లు
అగ్నిమాపక	20లక్షలు
మత్స్యశాఖ	24.66లక్షలు
పశుసంవర్ధక	30లక్షలు
గిరిజనాభివృద్ధి	4కోట్లు
సమాచార పౌరసంబంధాలు	50లక్షలు
వైద్య ఆరోగ్యం	10 కోట్లు
పోలీస్	10.50 కోట్లు
అటవీ	20లక్షలు
ఐసీడీఎస్	23లక్షలు
రెవెన్యూ	5.25 కోట్లు
దేవాదాయ	1.5 కోట్లు
ఎక్సైజ్	20లక్షలు
పర్యాటక	50లక్షలు
విద్యుత్	3.96కోట్లు
రవాణా	2.25 కోట్లు

నిధులు మంజూరు చేయడం సంతోషం



మేడారం జాతరకు నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. అధికారులు త్వరితగతిన పనులను చేపట్టాలి. జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలి. కొత్త ప్రభుత్వం నుంచి త్వరగా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేసిన మంత్రులు సీతక్క, కొండా సురేఖకు పూజారుల సంఘం తరఫున కృతజ్ఞతలు.

- సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నగరంలోని పలు పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భద్రకాళి చెరువుపై స్మార్ట్ సిటీ పథకం కింద రెండో దఫా రూ.70 కోట్ల వ్యయంతో చేపడుతున్న బండ్ సుందరీకరణ పనుల పురోగతిపై సీరియస్‌గా దృష్టి కేంద్రీకరించాలన్నారు. పాత్ వే, సైకిల్ ట్రాక్, గ్రీనరీ తదితర పనుల్ని జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని ఇంజనీర్లు కాంట్రాక్టర్ల వెంట పడాలని సూచించారు. పోతన రోడ్–అజర హాస్పిటల్ వద్ద చేపట్టిన డ్రెయిన్ పనులను కమిషనర్ పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. నయీమ్‌నగర్ ప్రధాన దారిపై నిర్మించనున్న కల్వర్టు నిర్మాణాన్ని నేషనల్ హైవే అధికారుల సమన్వయంతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జవహర్‌నగర్‌లో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల పురోగతిని కమిషనర్ పరిశీలించి పనుల్లో వేగం పెంచాలన్నారు. హనుమకొండలో రూ.9 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను పరిశీలించి, పనులు పూర్తయ్యేందుకు ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టాలన్నారు. కాజీపేట, ఎస్‌ఐటీ జంక్షన్లను కమిషనర్ పర్యవేక్షించి, విస్తరణకు వెంటనే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట బల్దియా ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, సీహెచ్ఓ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజయ్య, శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, స్మార్ట్‌సిటీ పీఎంఈ ఆనంద్ ఓలేటి, డీఈలు ఏఈలు, కాంట్రాక్టర్లు ఉన్నారు.



భద్రకాళి బండ్‌పై స్మార్ట్‌సిటీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

23న యువతకు జిల్లాస్థాయి పోటీలు

కాశిబుగ్గ : గ్రామీణ ప్రాంతాల యువతకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. 15–29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిలో కళా నైపుణ్యాలను, సాహిత్య ప్రతి భను వెలికి తీసేందుకు ఈనెల 23న పోతన విజ్ఞాన పీఠంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ ఎంట్రీలను ఈనెల 22లోగా ఓసిటీలోని జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. వివరాల కోసం 99481 85608, 77021 55096, 81060 60686 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

కలెక్టరేట్ పనుల్లో వేగం పెంచండి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచి, గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఆజంజాహి మిల్ గ్రౌండ్‌లో చేపట్టిన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రూ.80 కోట్ల వ్యయంతో భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో భాగంగా లెంటల్ లెవల్‌కు చేరుకున్నాయని చెప్పారు. ఈక్రమంలోనే రెసిడెన్షియల్ క్వార్టర్‌లు నిర్మించే ప్రాంతాలను కూడా పరిశీలించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేందర్‌రావు, ఈఈ జితేందర్‌రెడ్డి, డీఈ రాజు, ఏఈ శ్రీకాంత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ పనుల వివరాలు తెలుసుకుంటున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

తల్లీబిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ

గీసుకొండ: వైద్యులు, సిబ్బంది తల్లీబిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించి, వారికి సత్వర వైద్య సేవలు అందించాలని వరంగల్ డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ అన్నారు. గర్భిణులు, ప్రసవం అనంతరం తల్లులు డిప్రెషన్‌కు గురికాకుండా ఉండడానికి అందించాల్సిన వైద్య సేవలపై గురువారం వరంగల్ నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఉంటే ప్రసవం సులభం అ వుతుందన్నారు. శిశువు తక్కువ బరువు ఉండడం, నెలలు నిండకుండా ఉండడం తదితర సమస్యలపై వైద్యులు, సిబ్బంది శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు, సైకియాట్రిస్ట్ భరత్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎంసీహెచ్ డాక్టర్ పద్మశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా వరుణ్‌రెడ్డి

యువ ఐఏఎస్‌ను నియమించిన ప్రభుత్వం
- 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వరుణ్‌రెడ్డి
- 2014 నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారికే పట్టం
- తొమ్మిదేళ్ల తర్వాత ఎన్పీడీసీఎల్‌కు ఐఏఎస్ అధికారి

సాక్షిప్రతినిధి, వరంగల్:

తెలంగాణ ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్‌పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్‌గా కర్నాటి వరుణ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత ఎన్‌పీడీసీఎల్‌కు ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వరుణ్‌రెడ్డి 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఈయన బాంబే ఐఐటీలో చదివారు. సివిల్స్‌లో ఆలిండియా 7వ ర్యాంకు సాధించడం గమనార్హం. ఐఏఎస్‌కు ముందు 2017లో ఐఆర్ఎస్ సాధించి, ఇన్‌కంటాక్స్ శాఖలో పనిచేశారు. అనంతరం ఐఏఎస్ సాధించి తెలంగాణ కేడర్ అధికారిగా వచ్చారు. ఉట్నూర్ ఐటీడీఏ పీఓకు ముందు కొమురంభీమ్ ఆసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పని చేశారు. 2023 జనవరి 31న నిర్మల్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా వరుణ్‌రెడ్డికి బదిలీ అయ్యింది. జీఏడీలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఎన్పీడీసీఎల్ వరంగల్ సీఎండీగా నియమితులయ్యారు. వరుణ్‌రెడ్డి తల్లి నాగమణి వ్యవసాయశాఖలో అడిషనల్ డైరెక్టర్ కాగా.. తండ్రి జనార్దన్‌రెడ్డి ప్రముఖ వైద్యుడిగా సేవలందిస్తున్నారు. వరుణ్‌రెడ్డి తన ఐఏఎస్ బ్యాచ్‌మేట్ చాహత్ బాజ్‌పాయ్‌ను పెళ్లి చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం ఉట్నూరు ఐటీడీఏ పీఓగా కొనసాగుతున్నారు.



కర్నాటి వరుణ్‌రెడ్డి

విధి నిర్వహణలో తనదైన ముద్ర..

2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వరుణ్‌రెడ్డి విధి నిర్వహణలో తొలి పోస్టింగ్‌లోనే తనదైన ముద్ర వేసి ప్రజలను ఆకట్టుకున్నారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్‌గా పని చేసిన ఆయన ఆ తర్వాత ఉట్నూరు ఐటీడీఏ పీఓగా పని చేశారు. ఆ సమయంలో సమస్యలను తెలుసుకునేందుకు స్వయంగా గిరిజన తండాలు, గూడేలను సందర్శించి పరిష్కారం చూపడం కోసం కృషి చేశారు. తొలిసారి కలెక్టర్‌గా కేవలం 8 నెలల తొమ్మిది రోజుల పాటు నిర్మల్ జిల్లాలో కొనసాగిన వరుణ్‌రెడ్డి అక్కడా తనదైన ముద్ర వేశారు. రోజూ పర్యటనలు చేసి జిల్లా మొత్తం తిరిగేవారు. వర్షాలు, వరదల సమయంలో సకాలంలో స్పందించారు. ప్రధానంగా జిల్లాలోని మహిళల్లో ఉన్న రక్తహీనత నివారించడానికి 'అనీమియాసే నిర్మల్ ముక్త్' కార్యక్రమానికి ప్రభుత్వం నుంచి ప్రశంసలు వచ్చాయి. గ్రామీణాభివృద్ధి, ఉపాధిహామీల్లో రాష్ట్ర ప్రథమ అవార్డులు జిల్లాకు దక్కేలా చేశారు. పోనికి వనం ప్రారంభం, చారిత్రక కట్టడాల పరిరక్షణ, అభివృద్ధి పనుల ప్రారంభాల్లో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. 2019 బ్యాచ్‌కు చెందిన జూనియర్ కావడంతోనే ఎన్నికల వేళ నిర్మల్ కలెక్టర్‌గా ఉన్న వరుణ్‌రెడ్డిని బదిలీ చేసినట్లు సమాచారం.

తొమ్మిదేళ్ల తర్వాత ఎన్పీడీసీఎల్‌కు ఐఏఎస్

తెలంగాణకు కీలకమైన ఎన్పీడీసీఎల్‌కు సుమారు తొమ్మిదేళ్ల తర్వాత యువ ఐఏఎస్ అధికారిని నియమించారు. 2006 నుంచి 2008 వరకు ఐఏఎస్ అధికారి వి.అనిల్‌కుమార్ సీఎండీగా పనిచేయగా, ఆయనను రెండేళ్లకే బదిలీ చేసి నర్సింహారెడ్డిని ప్రభుత్వం నామినేట్ చేసింది. ఆయన సుమారు నాలుగేళ్లు పని చేయగా, 2009 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కార్తికేయ మిశ్రను 2012లో అప్పటి ప్రభుత్వం సీఎండీగా నియమించింది. 2014లో వెంకటనారాయణను నామినేట్ చేయగా.. ఆయన 2016 వరకు సీఎండీగా వ్యవహరించారు. 2016లో ఎ.గోపాల్‌రావును ప్రభుత్వం ఎన్‌పీడీసీఎల్‌కు సీఎండీగా నియమించగా సుమారు ఏడేళ్లపాటు ఆయన ఈ పదవిలో 'అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్'పైన కొనసాగుతూ వచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయన ఈ నెల 6న గోపాల్‌రావు రాజీనామా చేశారు. రాష్ట్రంలో పాలనను గాడిన పెట్టేందుకు అన్ని శాఖలను ప్రక్షాళన చేస్తున్న ప్రభుత్వం విద్యుత్ సంస్థలపై దృష్టి పెట్టింది. ఎన్పీడీసీఎల్‌కు తొమ్మిది సంవత్సరాలుగా ఐఏఎస్‌లు లేకపోగా.. ఉద్యోగ విరమణ చేసిన వారికే... సీఎండీ నుంచి కీలక డైరెక్టర్ పదవులను పలువురికి కట్టబెట్టారు. ఈ సమయంలో ఎన్‌పీడీసీఎల్‌లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలు మొదలు.. కోట్లాది రూపాయల పనుల్లో టెండర్ల మాయాజాలం, బంధువులకు పనులు కట్టబెట్టడంతో పాటు పెద్దమొత్తంలో నిధుల వినియోగంలో అక్రమాలు, అవినీతి జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ మేరకు ప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంటెలిజెన్స్ వర్గాలతో గోప్యంగా విచారణ కూడా జరుపుతోంది. ఇదే సమయంలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా యువ ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డిని నియమించడం హాట్‌టాపిక్‌గా మారింది.

క్లుప్తంగా

నేడు కేవీకేలో కిసాన్ మేళా

కరీమాబాద్: మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజన్న గురువారం తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, యంత్రాల వినియోగం, అధిక సాంద్రత, పత్తి సాగుపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి మహేందర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఉమారెడ్డితోపాటు వివిధ అనుబంధ శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. రైతులు అధికంగా హాజరై పంటల సాగులో ఆధునిక పద్ధతుల గురించి అవగాహన పెంపొందించుకోవాలని రాజన్న కోరారు.

17న ఉమ్మడి జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

హన్మకొండ: ఈ నెల 17వ తేదీన హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి 69వ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వీరన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం ఉదయం 9గంటలకు జేఎన్ఎస్‌లోని బ్యాడ్మింటన్ మైదానం వద్ద రిపోర్టు చేయాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడా జట్టు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటుందని తెలిపారు. ఇతర పూర్తి వివరాలకు మొబైల్ నంబర్ 98492 01467లో సంప్రదించాలని కోరారు.

వరంగల్ డీసీసీబీ సీఈఓగా వజీర్ సుల్తాన్



హన్మకొండ: వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) సీఈఓగా వజీర్ సుల్తాన్ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ముఖ్య కార్య నిర్వాహణాధికారిగా పని చేసిన సీహెచ్.చిన్నారావు కాల పరిమితి అక్టోబర్ 10తో ముగింసింది. దీంతో ఖాళీగా ఉన్న ఈ పదవిని భర్తీ చేసేందుకు టీఎస్ కాబ్ నోటిఫికేషన్ జారీ చేసింది. 14 మంది దరఖాస్తు చేసుకోగా సహకార శాఖ, నాబార్డ్, టీఎస్‌కాబ్ అధికారులతో కూడిన ఎంపిక కమిటీ అక్టోబర్‌లో ఇంటర్వ్యూ నిర్వహించింది. ఇందులో ప్రతిభ కనబరిచిన వజీర్ సుల్తాన్‌ను కమిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఎంపిక చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమైంది. కాగా, చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సమక్షంలో వజీర్ సుల్తాన్ గురువారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సీఈఓకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు, పాలక వర్గం సభ్యులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర రెడ్డి, జనరల్ మేనేజర్ బి శ్రీధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్స్ రోహిణి, దమయంతి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు రాజశేఖర్, నవీన్, డైరెక్టర్లు కక్కిరాల హరిప్రసాద్, ఎన్నమనేని జగన్ మోహన్ రావు, దొంగల రమేష్, సంపెల్లి నర్సింగ రావు, చెట్టుపల్లి మురళీధర్, ఎలుగం రవిరాజా, నరేంద్ర, మాడుగుల రమేష్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతు సెల్‌ఫోన్ చోరీ

కేసముద్రం: ధాన్యం రాశి వద్ద నిద్రిస్తున్న ఓ రైతు నుంచి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన బుధవారం అర్ధరాత్రి కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో చోటుచేసుకుంది. నెల్లికుదురు మండలం రత్తిరాంతండాకు చెందిన హత్తిరాం తన ధాన్యాన్ని అమ్మేందుకు రెండు రోజుల క్రితం మార్కెట్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ధాన్యానికి టెండర్ వేసిన వ్యాపారి కాంటా పెట్టకపోవడంతో అక్కడే నిద్రించాడు. ఈ క్రమంలో తన జేబులో ఉన్న రూ.20 వేల విలువైన సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. తీరా ఆ రైతు నిద్రలేచి చూసే సరికి సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో గురువారం మార్కెట్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

సర్దుబాటుతో తడ‘బడి’

- మూతపడిన టేకులగూడెం యూపీఎస్
- చదువు కోసం విద్యార్థులు కాజీపేటకు..



విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సర్దుబాటుకు అనుగుణంగా ఆ పాఠశాల సర్దుకోలేకపోయింది. ఎంతో మందిని ప్రయోజకుల్ని చేసిన ఆ బడి ప్రస్తుతం తడబడింది. పిల్లల అల్లరి లేక ఆవరణంతా బోసిపోయింది. ఊరికి దూరంగా ఉండే ఆ స్కూల్‌ను సర్దుబాటు పేరిట అధికారులే వెలివేశారేమో! ఫలితంగా ఆ పాఠశాల మూతపడింది. చదువుల కోసం దాదాపు ఆరు, ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాజీపేటకు పిల్లలు వచ్చి వెళ్తున్నారు.

నెపం.. విద్యార్థులకు శాపం

కాజీపేట మండలం టేకులగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఈఏడాది అక్టోబర్ సగం వరకు విద్యాబోధన జరిగింది. ఆయూపీఎస్‌లో ఆరుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించేవారు. తక్కువ మంది విద్యార్థులున్నారనే నెపంతో అక్కడ పని చేసే ఉపాధ్యాయులను సంబంధిత మండల విద్యాశాఖ అధికారి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఇతర పాఠశాలలకు పంపారు. దీంతో క్రమ క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గింది. పూర్తి స్థాయిలో ఆ యూపీఎస్ మూతపడింది. పాఠశాలలో విధులు నిర్వర్తించాల్సిన ఆరుగురు ఉపాధ్యాయుల్లో మడికొండ హైస్కూల్‌లో నలుగురు, మడికొండ ప్రాథమిక పాఠశాలలో మరొకరు, కాజీపేట గర్ల్స్ స్కూల్‌లో ఇంకొకరు మొత్తం ఆరుగురు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద పనిచేస్తున్నారు. కనీసం ఇద్దరు ఉపాధ్యాయులనైనా ఆ టేకులగూడెం పాఠశాలలో విధులను నిర్వర్తిస్తే ఆపాఠశాల మూతపడేది కాదని పలువురు పేర్కొంటున్నారు. సక్రమంగా నడుస్తున్న పాఠశాలను మూతపడేయడంలో ఆంతర్యమేంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ టేకుల గూడెం యూపీఎస్ మూత పడేయటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మడికొండ హైస్కూల్‌లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద పని చేస్తున్న టీచర్లలో ఒకరు టేకులగూడెం యూపీఎస్‌లో సీనియర్ ఉపాధ్యాయుడు హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించేవారు. అతను ఇటీవలే అనారోగ్య కారణాలతో మరణించారు. మిగతా ఐదుగురిలో ముగ్గురు ఉపాధ్యాయులకు మాత్రమే వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉత్తర్వులు ఉన్నాయని తెలుస్తోంది మిగతా ఇద్దరిని అనధికారికంగానే వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అని చెప్పి కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే యూపీస్‌ను మూసివేయడం సంబంధిత అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. మండల విద్యాశాఖాధికారి రాంకిషన్‌రాజును గురువారం వివరణ కోరగా.. రెండు మూడ్రోజుల్లో ఆ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను పంపి రీ ఓపెన్ చేయిస్తామని వివరణ ఇచ్చారు.

పీడీ యాక్ట్ నమోదైనా.. మారని తీరు

- అంతర్ జిల్లా దొంగ అరెస్ట్
- వివిధ పీఎస్‌ల్లో 30 చోరీ కేసులు నమోదు



ఇర్ఫాన్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి: చోరీలకు పాల్పడుతున్న ఓ నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించినా అతడి తీరు మారలేదు. జైలు నుంచి విడుదలైన అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మళ్లీ చోరీలు చేయడం ప్రారంభించారు.ఈ క్రమంలో బాహుపేట క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలు అంగీకరించినట్లు సీఐ గోపీ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన షేక్ ఇర్ఫాన్‌పై 30కి పైగా చోరీ కేసులు నమోదయ్యాయి. వివిధ కేసుల్లో అరెస్ట్ అయి ఖమ్మం జైలుకు వెళ్లాడు. ఇదిలా ఉండగా ఇర్ఫాన్‌పై నమోదైన కేసులను పరిశీలించిన అధికారులు పీడీయాక్ట్ ఓపెన్ చేశారు. జైలులో ఉన్నప్పుడు ఖమ్మం చెందిన మతీన్ అనే మరో దొంగ ఇర్ఫాన్‌కు పరిచయమయ్యాడు. జైలు నుంచి విడుదలైన వీరిద్దరు ఖమ్మం,మహబూబాబాద్, కొత్తగూడెం, ఇల్లంద పోలీస్‌స్టేషన్‌పరిధిలో పలు చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మడికొండలోని ఓ ఇంట్లో రెండున్నర తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.20వేలు నగదు ఎత్తుకెళ్లారు.

ఇద్దరి మధ్య గొడవలు..

చోరీ సొత్తు పంపిణీలో ఇర్ఫాన్, మతీన్ మధ్య గొడవలు జరిగాయి. దీంతో వారిద్దరూ విడిపోయారు. ఈక్రమంలో మడికొండలో జరిగిన చోరీ కేసులో పోలీసులు మతీన్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. తర్వాత ఇర్ఫాన్ హసన్‌పర్తి పీఎస్ పరిధిలో ఓ ఆటోను అపహరించాడు. కాగా, బుధవారం వాహనాల తనిఖీ సందర్భంగా ఇర్ఫాన్ పట్టుబడ్డాడు.

బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

- అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

వరంగల్ అర్బన్: రుణాలు, వివిధ పథకాల్లో బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం స్వానిధి పథకంలో భాగంగా ప్రభుత్వం గతంలో బల్దియాకు సూచించిన లక్ష్యాన్ని చేరుకొని దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా ఇటీవల అదనంగా మరో 6వేల మంది స్ట్రీట్ వెండర్లను గుర్తించి రుణాలు అందించాలని ఆదేశించిందని, బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. ఈ నెల చివరిలోగా నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీల అందజేత పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు (పీఎంఎఫ్‌ఎంఈ)కి దరఖాస్తు చేసుకున్న వారి యూనిట్లు గ్రౌండ్ అయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో టౌన్ ఐకేపీ ఇన్‌చార్జ్ రాజేష్, ఎల్‌డీఎం హవేలీ రాజు, డీపీఎంలు అనిత, సరిత, డీఎంసీ రేణుక, టీఎంసీ రమేష్, ఏపీఎంలు పాల్గొన్నారు.

మహిళకు టోకరా

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్‌కు చెందిన ఓ మహిళను హైదరాబాద్‌కు చెందిన వసంత్ అనే వ్యక్తి మోసం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. 'నితో' అనే యాప్ ద్వారా సదరు మహిళ, వసంత్ మధ్య పరిచయం ఏర్పడిందని, దీనిని ఆసరాగా చేసుకుని వసంత్ పలుమార్లు ఆ మహిళనుంచి డబ్బులు తీసుకున్నాడని పేర్కొన్నారు. ఇలా మొత్తం రూ. 7.50 లక్షల తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తిరిగి ఆమె డబ్బులు అడగడంతో వసంత్ ఫోన్ స్విచాఫ్ చేసుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు వసంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీపీని కలిసిన ఎస్సై శ్రీనివాస్

వరంగల్ క్రైం: చెన్నారావుపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ గురువారం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని ఎస్సైకి సూచించారు.

నమ్మి నట్టేట మునిగారు

రూ. 6 కోట్లతో చిట్టీ వ్యాపారి ఉడాయింపు

- ప్రశాంత్‌నగర్ కాలనీలో వెలుగు చూసిన ఘటన
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ.. చిట్టీదారులను నట్టేట ముంచింది. దాదాపు రూ.6 కోట్లకు పైగా నగదుతో ఉడాయించింది. ఈ ఘటన గురువారం వెలుగు చూసింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసుకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం కాలనీ చెందిన శ్రీదేవి రెండు దశాబ్దాల నుంచి నమ్మకంగా చిట్టీలు నిర్వహిస్తోంది. దీంతో వివిధ అవసరాల కోసం ఎంతో మంది కాలనీవాసులు ఆమె వద్ద చిట్టీలు వేశారు. చిట్టీలు ఎత్తిన అనంతరం అధిక వడ్డీ వస్తుందనే ఆశతో తిరిగి ఆ మహిళకే అప్పుగా ఇచ్చేవారు. ఈ నేపథ్యంలో సదరు మహిళ.. కొంతమందికి నెలనెలా వడ్డీ డబ్బులు చెల్లిస్తూ మరింత నమ్మకం సాధించింది. డబ్బుల విషయంలో నిక్కచ్చిగా ఉంటుందనే నమ్మకంతో అనేక మంది బంధు, మిత్రుల వద్ద తక్కువ వడ్డీకి తెచ్చుకుని శ్రీదేవికి ఇచ్చి ఎక్కువ వడ్డీని పొందుతుండేవారు. ఇలా కొంత కాలం నమ్మకంగా ఉంది. ఈ క్రమంలో సదరు మహిళ నెలరోజుల నుంచి కాలనీలో కనిపించడం లేదు. దీంతో బాధితులకు అనుమానం వచ్చి విషయం ఆరా తీయడం మొదలెట్టారు. ఇందులో సదరు మహిళ హైదరాబాద్‌కు పారిపోయిందని తెలియడతో ఆందోళనకు గురయ్యారు. అనంతరం కుటుంబీకులను నిలదీయగా వారు తమకు సంబంధం లేదని చెబుతుండగా చేసేదిలేక జిల్లా పోలీస్ అధికారులతో పాటు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సదరు మహిళ ఐపీ పెట్టడానికి ప్రయత్నిస్తుందనే సమాచారంతో బాధితులు మరింత కృంగిపోతున్నారు.

ఎమ్మెల్యే నాయిని అనుచరులపై కేసు నమోదు

వరంగల్ క్రైం: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తమ పేరుతో ఉన్న శిలా ఫలకాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు ఈ నెల 12న ధ్వంసం చేసినట్లు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఫిర్యాదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే నాయిని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



ఉదయ్(ఫైల్)

దోర్నకల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. డోర్నకల్ మండలంలోని చాప్లాతండాకు చెందిన భూక్యా ఉదయ్(28) బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి డోర్నకల్ నుంచి ద్విచక్రవాహనంపై చాప్లాతండాకు వెళ్తుండగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపునకు ఢీకొనడంతో ఉదయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో మహబూబాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి కృష్ణ ఏడేళ్ల క్రితం మృతి చెందగా తల్లి, సోదరి ఉన్నారు. తల్లి తార ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

కన్నాయిగూడెం మండలంలో మరో యువకుడు..

కన్నాయిగూడెం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సింగారం, చింతగూడెం ప్రధాన రహదారిపై జరిగింది. ఎస్సై సురేష్ కథనం ప్రకారం మండలంలోని ఐలాపురం గ్రామానికి చెందిన మండపల్లి సంజీవ్(26) కిరాణా షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై ఏటూరు నాగారం నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తున్నారు. మండలంలోని సింగారం, చింతగూడెం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడగా సంజీవ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో ములుగుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



సంజీవ్ మృతదేహం

బ్రాహ్మణపల్లిలో వ్యక్తి..



వీరస్వామి (ఫైల్)

గూడూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన అల్లెం వీరస్వామి (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతిడికి భార్య యశోద, కుమారుడు ఉన్నారు.

నిరీక్షణ.. ఇంకెన్ని రోజులు?

ఫార్మసీ కళాశాలకు బీఓఎస్ నియామకమెన్నడో!

- రొటేషన్‌గా నియమించే పదవిపై తీవ్ర జాప్యం
- ప్రాక్టికల్స్ పరీక్షల కోసం విద్యార్థుల ఎదురుచూపు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ (బీఓఎస్)నియామకంలో యూనివర్సిటీ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రెండేళ్లుగా బీఓఎస్‌గా విధులు నిర్వర్తించిన ఆ కళాశాల ప్రొఫెసర్ స్వరూపరాణి పదవీ కాలం గత నెల 23న ముగిసింది. 20 రోజులు గడిచినా ఆమె స్థానంలో ఎవరిని నియమించకుండా జాప్యం చేస్తున్నారు. రెండేళ్లపాటు ఉండే ఈ పదవిలో రొటేషన్ పద్ధతిలో సీనియారిటీ ప్రకారం నియమించాల్సింటుంది. బీఓఎస్‌ను నియమించకపోవడంతో బీఫార్మసీ రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 8 నుంచి జరగాల్సిన ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించడంలేదు. ఎందుకంటే ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఎగ్జామినర్ల పేర్లను బీఓఎస్ పరీక్షల విభాగానికి పంపాల్సింటుంది. ఇంకా వివిధ కీలక బాధ్యతలు కూడా ఉంటాయి. బీఓఎస్ పదవికి అర్హులు ఉన్నా నియామకంలో జాప్యం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షల కోసం నిరీక్షిస్తున్నారు.

నియామక విషయంలో మల్లగుల్లాలు..

కేయూ ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్‌గా కృష్ణవేణి, అసోసియేట్ ప్రొఫెసర్ నాగరాజు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిద్దరిలో ఎవరిని బీఓఎస్‌గా నియమించాలనే విషయంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని సమాచారం. సీనియారిటీ ప్రాతిపదికన బీఓఎస్‌ను నియమించాల్సింటుంది. ఆ ఇద్దరు కూడా ఒకేసారి 2007 జనవరి 2న యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియామకమయ్యారు. ఆ తరువాత మెరిట్ ప్రాతిపదికన ముందుగానే అసోసియేట్ ప్రొఫెసర్‌గాను, ప్రొఫెసర్‌గా కృష్ణవేణి కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద (క్యాస్) పదోన్నతి పొందారు. నాగరాజు ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. అయితే నియామకమప్పటి రోస్టర్ ప్రకారం చూస్తే నాగరాజు సీనియర్ అవుతారని అంటున్నారు. ప్రొఫెసర్‌నే బీఓఎస్‌గా నియమించాలంటే కృష్ణవేణి నియమించాల్సింటుందని భావిస్తున్నారు. ఎందుకంటే గతంలో ఫిజిక్స్ విభాగంలో విభాగం అధిపతి నియామకంలో, ఫార్మసీ కళాశాలలో డీన్ నియామకంలో ముందు ప్రొఫెసర్ అయినవారినే నియమించారని చర్చ సాగుతోంది. అలాంటప్పుడు ప్రొఫెసర్ కృష్ణవేణిని బీఓఎస్‌గా నియమించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే సీనియారిటీని ప్రాతిపదకను తీసుకోవాలనే ఉద్దేశంతో అధికారులు ఆ ఇద్దరిలో ఎవరు సీనియర్ అనే విషయం పరిశీలించి క్లారిఫికేషన్ ఇవ్వాలని పరిపాలనాభవనంలోని టీచింగ్ విభాగానికి సంబంధిత ఫైల్ పంపారని సమాచారం. ఆ ఇద్దరిలో ఎవరినో ఒకరికి బీవోఎస్‌ను త్వరగా నియమించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

17న మెగా క్రిస్మస్ వేడుకలు

నయీంనగర్: 11వ త్రినగర ఐక్య మెగా క్రిస్మస్ వేడుకలు డిసెంబర్ 17న పునీత ఆంథోనీ కళా పుణ్యక్షేత్రం ఫాతిమానగర్‌లో నిర్వహించనున్నట్లు వరంగల్ బిషప్ ఉడుముల బాల, బిషప్ డానియల్ కళ్యాణపు తెలిపారు. గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... సంఘాలకతీతంగా క్రైస్తవులంతా ఒకే చోట చేరి ఈ లోకాన్ని పాపుల నుంచి రక్షించేందుకు జన్మనించిన బాల యేసును ఆరాధించేందు కోసం ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవుణ్ణి స్తుతించి కృతజ్ఞతలు తెలుపుతూ.. క్రీస్తు జయంతి పండుగను కొనియాడుతూ.. ఆనందాన్ని పంచుకో వడానికి ఈ వేడుకలు ఉద్దేశించబడినట్లు తెలిపారు. త్రినగరిలో ఉన్న అన్ని క్రైస్తవ సంఘాల బిషప్‌లు పాస్టర్లు సంఘ పెద్దలు విశ్వాసులు పాల్గొనాలన్నారు. వేడుకల్లో భాగంగా పాటల పోటీలు, కోరియోగ్రఫీ, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట క్రైసవులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బిషప్ మార్కండేయ, బిషప్ జాన్ మార్క్, ఫాదర్ జి.కమల్, ఫాదర్ జి.అనుకిరణ్, జోష్వా, రవికుమార్, రేవా మందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాపం.. పసికందు..

- మురుగు కాల్వలో శిశువు మృతదేహం లభ్యం

తొర్రూరు: పాపం.. పసికందు. తల్లిదండ్రులు వద్దనుకున్నారో..? లేదా ఇతర ఏమైనా సమస్య ఉందో ఏమో తెలియదుకాని తల్లి పొత్తిళ్లల్లో ఉండాల్సిన ఓ శిశువు మురుగు కాలువ పాలైంది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున డివిజన్ కేంద్రంలో జరిగింది. తొర్రూరు పెద్ద చెరువు సమీపంలోని మురుగు కాల్వలో స్థానికులకు శిశువు మృతదేహం కనిపించింది. దీంతో వారు వెంటనే పోలీసులు, ఇతర అధికారులకు సమాచారం అందించారు. డీఎంహెచ్ఓ అంబరీష్, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ మురళీధర్, ఎస్సై రాంజీనాయక్ ఘటనా స్థలికి చేరుకుని శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. అప్పుడే పుట్టిన మగశిశువుగా గుర్తించారు. శిశువు మృతదేహానికి పంచనామా నిర్వహించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్ కొమ్ము దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి హత్య.. నేరస్తుడికి యావజ్జీవ శిక్ష

- తీర్పు వెలువరించిన వరంగల్ రెండో అదనపు జిల్లా కోర్టు



వరంగల్ లీగల్ : స్నేహితుడి భార్యను లొంగ దీసుకోవడానికి, వారి కుమారుడిని గొంతును లిమి చంపిన నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ గురువారం వరంగల్ రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి సత్యేంద్ర తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ లేబర్‌కాలనీ గాంధీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కడారి రాజేష్, రాధిక దంపతులు. వీరికి ఓ కూతురు, కుమారుడు వినయ్ (8 సంవత్సరాలు) ఉన్నారు. వినయ్ మూడో తరగతి చదువుతున్నాడు. వినయ్ ఎప్పటిలాగే 2017, జూలై 19న స్కూల్‌కు వెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు ఆటో డ్రైవర్ ఫోన్ చేసి మీ అ బ్బాయి కనిపించడం లేదని తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో స్కూల్ చుట్టుపక్కల, బంధువుల వద్ద రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. తెల్లవారుజామున ఇంటి సమీపంలో ఉన్న వేరే ఆటోలో ఓ సంచిలో ఓ మృతదేహం కట్టి ఉందనే విషయం తెలిసి రాజేష్, రాధిక దంపతులు ఘటనా స్థలిని వెళ్లి చూశారు. మృతదేహం తమ కుమారుడిదిగా గుర్తించారు. వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల ఆసక్తికర అంశాలు..

పోలీసుల నేర పరిశోధనలో ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. రాజేష్ స్నేహితుడు చింతల మధు (కారు డ్రైవర్) అవివాహితుడు. తరుచూ రాజేష్ ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో రాజేష్ భార్య రాధిక పై కన్నేశాడు. ఎలాగైనా ఆమెను సొంతం చేసుకోవాలని భావించాడు. నిన్ను పెళ్లి చేసుకుంటానని, రూ.10 లక్షల ఆస్తి నీ పేరు మీద రాస్తానని ప్రలోభపెట్టేవాడు. దీనికి రాధిక నిరాకరించడంతో ఎలాగైనా ఆమెను దక్కించుకోవాలని, అందుకోసం అడ్డుగా ఉన్న ఆమె కొడుకు, కుతూరును తొలగించుకోవాలని భావించాడు. కూతురు హాస్టల్‌లో చదువుకుంటుంది. కుమారుడి హతమార్చి ఆ నేరం బాలుడి తండ్రిపై నెట్టి ఆయనను జైలుకు పంపి రాధికను లొంగదీసుకోవాలని మధు పథకం వేశాడు.

కూల్‌డ్రింక్‌లో మద్యం కలిపి ఇచ్చి హత్య

పథకం ప్రకారం మధు 2017 జూలై 19న ఓ ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకుని వినయ్ చదువుకుంటున్న మిల్స్‌కాలనీలో గల యూనిక్ స్కూల్ వద్దకు వెళ్లాడు. అక్కడ వినయ్‌ను కారులో తీసుకుని న్యూశాయంపేట వద్దకు వచ్చాడు. అక్కడ కూల్‌డ్రింక్‌లో మద్యం కలిపి వినయ్‌కు తాగమని ఇచ్చాడు. కూల్‌డ్రింక్ అనుకుని వినయ్ సేవించాడు. అనంతరం శాయంపేట నుంచి జూలైవాడ చేరుకున్న మధు అక్కడ నిర్జీవ ప్రదేశంలో కారు ఆపాడు. మద్యం మత్తులో ఉన్న వినయ్ కారులో పడుకున్నాడు. ఇదే అదునుగా భావించిన మధు.. చిన్నారి మెడలు విరిచి కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం కారులో ఇంటికెళ్లిన మధు.. బస్తాలో వినయ్ మృతదేహాన్ని పెట్టి తన ఇంటి సమీపంలో ఉన్న చెట్ల పొదల్లో వేశాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై మృతదేహం ఉన్న బస్తా తీసుకుని మృతుడి ఇంటికి సమీపంలో ఉన్న ఆటోలో పెట్టి ఏమీ తెలియనట్లు ఇంటికి వచ్చాడు.

ఏమీ తెలియనట్లు బాలుడి ఆచూకీ కోసం గాలింపు

వినయ్ కనిపించడం లేదనే విషయం తెలుసుకున్న మధు.. అందరితో పాటు అర్ధరాత్రి వరకు బాలుడి ఆచూకీ కోసం వెతికాడు. మరుసటి ఉదయం సంచిలో శవాన్ని గుర్తు పట్టిన మృతుడు వినయ్ తల్లిదండ్రులు రాజేష్, రాధిక దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులు నిందితుడు చింతల మధును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో మధుకు యావజ్జీవ కారాగార శిక్ష , రూ.6 వేల జరిమానా విధిస్తూ జడ్జి వైసత్యేంద్ర తీర్పు వెల్లడించారు. కేసును పోలీస్ అధికారులు బోనాల కిషన్, ఎస్.చైతన్‌కుమార్, పి.తిరుమల్ పరిశోధించారు. లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి పర్యవేక్షణలో కానిస్టేబుల్ డి.ప్రతాప్, సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోకాళ్ల సత్యనారాయణగౌడ్ వాదించాడు.

భర్త వేధింపులు.. వివాహిత ఆత్మహత్య



హారిక (ఫైల్)

ఐనవోలు : కట్నం కోసం భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఐనవోలు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై వంగాల నవీన్ కుమార్ కథనం ప్రకారం ములుగు జిల్లా రామచంద్రాపురానికి చెందిన హారిక(19) ఐనవోలు మండల కేంద్రానికి చెందిన అలుగునూరి నాగరాజును 8 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. అయితే కట్నం కోసం భర్త కొంత కాలంగా తరచూ వేధించ సాగాడు. దీనికి మనస్తాపం చెందిన హారిక బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి చీకట్ల కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో రైతు..



నరేష్(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: కుటుంబ కలహాలతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తాటికొండ శివారు జీబీ తండాలో జరిగింది. తండాకు చెందిన భూక్యా నరేష్(37) వ్యవసాయ బావి వద్ద భార్య అనితతో గురువారం సాయంత్రం గొడవ పడ్డాడు. ఈ క్రమంలో క్షణికావేశంలో నరేష్ పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం..

- ప్రియుడి ఇంటి ఎదుట యువతి ధర్నా

రాయపర్తి: పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడనే కారణంతో ఓ యువతి తన బంధువులతో కలిసి గురువారం ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించింది. బాధితురాలి కథనం ప్రకారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూక్యతండాకు చెందిన గుగులోత్ సావిత్రి, గోప్యతండాకు చెందిన భూక్యా ప్రతాప్ ఏడాదిన్నర నుంచి ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు ఆమె వివాహం కోసం సంబంధాలు చూస్తుండగా సావిత్రిని తానే పెళ్లి చేసుకుంటానని ప్రతాప్ హామీ ఇచ్చాడు. తీరా వివాహం చేసుకోవాలని కోరగా నెల రోజులుగా తప్పించుకుంటున్నారన్నారు. దీంతో చేసేది ఏమిలేక ప్రతాప్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించినట్లు తెలిపింది. ఈ విషయంలో అధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకుంది. కాగా, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సావిత్రి ఆవేదన వ్యక్తం చేసింది.